## క్లుప్తంగా

### 98 ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**పార్వతీపురం టౌన్:** 98 ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం వైస్ ప్రెసిడెంట్ ఆర్వీ ప్రసాద్ కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విజయచంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సర్వీసులను 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. 12 నెలల వేతనం సదుపాయం కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టి తమకు తగు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, సురేంద్ర, అప్పలనాయుడు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

### ఏఓకు పదోన్నతి

**సీతానగరం:** మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి(ఏఓ) ఎంఎల్ఎన్ ప్రసాద్ ఎంపీడీఓగా పదోన్నతి పొందారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయానికి శనివారం సీఈఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఈయనకు పదోన్నతి పట్ల కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

### వాహన చోదకులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

**పార్వతీపురం రూరల్:** వాహన చోదకులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తోటపల్లి సెక్షన్ రహదారులు, భవనాల శాఖ సహాయక కార్యనిర్వాహక ఇంజినీర్ వి.రామమోహనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న సాక్షి దినపత్రికలో 'రోడ్డు పనులు సకాలంలో పూర్తి చేయాలి' శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. అడ్డాపుశీల నుంచి తోటపల్లి రిజర్వాయర్ కుడి ప్రధాన కాలువ మీదుగా ఎర్రన్నగుడి జంక్షన్ రహదారి మరమ్మతుల కోసం రూ.150 లక్షలతో ప్రతిపాదనలు చేసినట్టు తెలిపారు. వాహనాల రాకపోకల సమయంలో డబ్ల్యూఎంఎం లేయర్ ధూళి కారణంగా ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు రహదారిపై వాటరింగ్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే అడ్డాపుశీల నుంచి కుడి ప్రధాన కాలువ వరకు బీటీ లేయర్ కూడా వేయడం జరిగిందన్నారు.

సాక్షి ఎఫెక్ట్...

### మండల సమావేశానికి అధికారుల డుమ్మా..

- మండిపడిన ఎంపీపీ శెట్టి పద్మావతి

**గుమ్మలక్ష్మీపురం(కురుపాం):** కురుపాం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండ ల సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారులు హాజరుకాకపోవడం పట్ల ఎంపీపీ శెట్టి పద్మావతి మండిపడ్డారు. మూడు నెలలకోసారి జరిగే సమావేశాలకు కూడా రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. ప్రజాసమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజాప్రతినిధులు సమావేశానికి వస్తే అధికారులు రాకపోవడం సమంజసం కాదన్నారు. ఇలా అయితే ప్రజల సమస్యలు ఏ విధంగా పరిష్కారమవుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయాన తన ఐదెకరాల పొలంలో వేసిన అరటి పంట ఇటీవల వానగాలికి పడిపోయిందని, నష్టపరిహారానికి వీఆర్వోకు సమాచారం ఇచ్చానని, వీఆర్వో, వీఏఏలు క్షేత్రస్థాయి పరిశీలన చేసి తహసీల్దారుకు నివేదిక ఇచ్చారని అయినా ఇంతవరకు పరిహారం ఇస్తున్నట్టా.. లేనట్టా అనే సమాచారం కూడా లేదన్నారు. అలాగే ఇటీవల చేసిన సర్వేలో తాను బతికి ఉండగానే డెత్ జాబితాలో తన పేరు నమోదు చేశారని.. ఇలాగేనా పనిచేసేది అని అధికారులను నిలదీశారు. తహసీల్దారు రమణమ్మ, ఎంపీపీ మధ్య కాస్త వాగ్వాదం నెలకొంది. అనంతరం సమావేశానికి హాజరైన కొన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు.

# భూసార పరీక్షలతో మేలు



- మట్టి నమూనాల సేకరణకు ఇదే అనువైన సమయం
- రైతుసేవా కేంద్రాల సాయంతో భూసార పరీక్షలు

**బలిజిపేట:** భూముల్లో ఇష్టానుసారం పంటలను సాగు చేస్తుండడంతో భూసారం తగ్గి పంట దిగుబడులు తగ్గుతున్నాయి. వాటిని నియంత్రించేందుకు, ఎరువులను అధికంగా వాడకుండా ఉండేందుకు భూసార పరీక్షలు ఎంతో అవసరం. రైతులు తమ భూముల్లో భూసార పరీక్షలు చేయించడం ఎంతో అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. భూసార పరీక్షల వలన రైతుల భూములలో ఏ మేరకు, ఏఏ ఎరువులను, సూక్ష్మ పోషకాలను వినియోగించుకోవాలో వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు అందిస్తారు. మండలంలో 1604 భూసార పరీక్షలు లక్ష్యంగా నిర్దేశించారు. వీటిలో ఇప్పటికే 84పరీక్షలు నిర్వహించడం జరిగింది.

#### మూడు దశల్లో భూసార పరీక్షలు

మట్టి నమూనా సేకరణ. భూసార పరీక్ష కేంద్రంలో పరీక్షలు. ఫలితాల లాధారంగా ఎరువుల సిఫార్సు.

మట్టి సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పొలం గట్ల పక్కన తీయకూడదు. నీటి ముంపు ఉన్న దగ్గర తీయరాదు. చెట్ల నీడ ఉన్న దగ్గర, చెట్ల వేర్లు వ్యాపించి ఉన్న దగ్గర తీయరాదు. సేంద్రీయ, రసాయనికి ఎరువులు వేసిన తర్వాత తీయరాదు. సేంద్రీయ, రసాయనిక ఎరువులు వేసిన 50రోజుల తర్వాత మట్టి నమూనాలు తీయాలి. చౌడు అమ్ల నేలల్లో, ఇతర ఏ సమస్యాత్మక నేలల్లోనైనా వేరువేరుగా మట్టి నమూనా సేకరించాలి. 15–30సెంటీమీటర్ల లోతులో మట్టి నమూనాలు సేకరించాలి. ఎటువంటి చెత్త ఉన్న దానిని తొలగించి 15–30సెంటీమీటర్ల లోతులో 'వి' ఆకారం గుంత చేసుకోవాలి. ఒకే మందంలో పైనుంచి కింద వరకు పలచన పొరలుగా తీసుకుని మట్టిని సేకరించాలి. జిగ్‌జాగ్ పద్ధతిలో ఒక ఎకరాకు 8నుంచి 10చోట్ల రెండు కిలోల మట్టిని సేకరించాలి. దీనిని ఒక గోనెపై వేసుకుని నీడలో ఆరబెట్టి ఏదైనా మట్టి గడ్డలు ఉంటే వాటిని చిదిమేయాలి. తరువాత దానిని 4 భాగాలు చేసుకుని ఒకొక్క భాగంలో నుంచి కొంత మట్టిని తీసుకుని ఒక కిలో మట్టిని తయారు చేసి నమూనాకు తీసుకోవాలి. వేసే పంటను బట్టి నమూనా సేకరణ మారుతుంది. స్వల్పకాలిక పంటలకు 15–20సెంటీమీటర్ల లోతు తీయాలి. తోట పంటలకు 3–4అడుగులు తీయాలి.



మిర్తివలసలో భూసార పరీక్షలకు మట్టి నమూనాసేకరిస్తున్న ఏఓ

#### భూసార పరీక్షలు చేయించుకోవాలి

మండలంలో 19 రైతుసేవా కేంద్రాల ద్వారా 1604 భూసార పరీక్షలకు అవసరమైన మట్టి నమూనాలు సేకరించాలని నిర్ధారణ చేయడం జరిగింది. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. భూసారాన్ని గుర్తించి వాటికి అనుగుణంగా ఉండే ఎరువుల వాడకంపై సూచనలు ఇవ్వడం జరుగుతుంది. భూసారం పెరుగుతుంది, ఎరువుల ఖర్చు తగ్గుతుంది.

– ఎం.శ్రావణ్‌కుమార్, ఏఓ, బలిజిపేట

#### స్థూల, సూక్ష్మ పోషకాలు లోపించకుండా..

మట్టి నమూనాలు పరీక్ష చేసిన తరువాత భూసార పరీక్ష ఫలిత ఆధారంగా సూక్ష్మ, స్థూల పోషకాల యొక్క విలువలను తెలియజేస్తూ వాటి ఆధారంగా రైతులకు అందించే సిఫార్సు. ప్రతీ రైతు సాగు చేసే పంటలలో స్థూల, సూక్ష్మ పోషకాలు లోపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. స్థూల, సూక్ష్మ పోషకాలుగా పిలువబడే నత్రజని, భాస్వరం, పొటాష్, జింకు, బోరాన్, సల్ఫర్, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, జిప్సమ్(కాల్షియం, గంధకం) పంటలతో లోపిస్తే దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. ఈ లోపాన్ని గుర్తించి సకాలంలో వాటిని వేసుకుని దిగుబడులను పెంచుకోవచ్చు. పోషకాల లోపాలు నివారించడానికి జిప్సమ్, జింకు, పచ్చిరొట్ట ఎరువులు సాగులోకి తీసుకురావాలి. ప్రతీ రైతు తమ పొలాలలో సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం మంచిదని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

### ● పార్టీ బలోపేతానికి పాటు పడండి



వైఎస్సార్‌సీపీని క్షేత్ర స్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు పని చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్‌టీఐ విభాగ అధ్యక్షుడిగా నియమితులైన సింగారపు ఈశ్వరరావు ఈ మేరకు రాజన్నదొరను శనివారం ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈశ్వరరావును రాజన్నదొర అభినందించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ పార్టీ బలోపేతమే అందరి లక్ష్యం కావాలన్నారు. – సాలూరు

### ● ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ





జమ్మూకశ్మీర్‌లోని పల్గాంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ పార్వతీపురం పట్టణంలో శనివారం జర్నలిస్టుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్ర దాడితో దేశం ఉలిక్కి పడిందన్నారు. సుందర నిలయమైన జమ్మూకశ్మీర్‌లో శాంతిని మంట గలిపేలా ఉగ్రదాడులు చేయడం ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు దాలినాయుడు, రామారావు, గౌరీశంకరరావు, రాము, శేఖర్, శంకరరావు, పోలినాయుడు, నాయుడు, శివ, నవీన్, రాజశేఖర్, శ్రీనివాసరావు, కిశోర్, శ్రీనివాసరావు, ప్రశాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు. – పార్వతీపురం టౌన్

## పథకాల అమల్లో వేగం పెంచండి

**మక్కువ:** ప్రభుత్వ పథకాల అమల్లో వేగం పెంచాలని, పారదర్శకంగా అమలు చేయాలని గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆమె శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. పల్లె ప్రగతి, హరిత హారం సముదాయ శుభ్రత, నీటి సరఫరా, పింఛన్ల పంపిణీ, గృహ నిర్మాణాలు, విద్యుత్ సరఫరా, పాఠశాలల ఆధునికీకరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు స్వీకరించే సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సంధ్యారాణి

గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అంతకు ముందు స్థానిక సాయి భగవాన్ కల్యాణ మండపంలో టీడీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ డీడీ స్వరూపరాణి, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం తదితర అధికారులు పాల్గొన్నారు.

### 'తోటపల్లి' పనులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

- మాజీ ఎమ్మెల్యే కళావతి

**వీరఘట్టం:** తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణ పనులపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరా యి కళావతి అన్నారు. మండల కేంద్రంలో శనివా రం ఆమె మీడియాతో మాట్లాడుతూ. ఎన్నికల ముందు ఈ ప్రాంతంలో ప్రచారం చేసిన ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తోటపల్లి పాత ఆయకట్టును సస్యశ్యామలం చేస్తామని రైతులను నమ్మించి ఓట్లు దండుకున్నారన్నారు. తీరా గెలిచాక తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణ పనులు 25 శాతం కంటే తక్కువ జరిగాయనే సాకు చూపించి అభివృద్ధి పనులను రద్దు చేసి ఈ ప్రాంత రైతులను మోసగించారని ఆరోపించారు. ఎన్నికల ముందు ప్రజలకు హామీలు ఇవ్వ డం.. గెలిచాక ఆ హామీలను నెరవేర్చకుండా డైవర్ష న్ రాజకీయాలు చేయడం సీఎం చంద్రబాబునాయుడుకు అలవాటేనని ఎద్దేవా చేశారు. వీరఘట్టం పట్టణ ప్రజలను దశాబ్దాల కాలంగా వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు గత వైఎస్సా ర్‌సీపీ ప్రభుత్వం రూ.5.50 కోట్లతో పట్టణ ప్రధాన రహదారిని అభివృద్ధి చేసిన విషయాన్ని ఈ సంద ర్భంగా గుర్తు చేశారు. అయితే ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తలకు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తున్నారని చెప్పారు. సమావేశంలో వండువ సర్పంచ్ మిడితాన కల్యాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు భోగి మణి, పిన్నింటి శ్రీను, అంబళ్ల రవి, శంభాన శ్రీను, గెంబలి మహేష్, అసిరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించండి

**పార్వతీపురం రూరల్:** రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ నాయకులు వి.దాలినాయుడు తన నాయకులతో కలసి ఎస్పీ కార్యాలయంలోని ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ పి.రంగనాధంకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్ల మరమ్మతులకు గురికావడం కారణంగా పలు చోట్ల వాహన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. దీంతో పలువురు దివ్యాంగులుగా తయారు కావడంతో పాటు మృత్యువాత పడుతున్నారన్నారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ వద్ద ఆటోలో పార్కింగ్‌పై దృష్టి సారించాలన్నారు. ఆయనతో పాటు సాలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ జి.రామకృష్ణ, పి.గౌరీశంకరరావు తదితరులున్నారు.



ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రంగనాధంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## పచ్చిరొట్ట ఎరువులను వినియోగించుకోవాలి



బర్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

**బలిజిపేట:** పచ్చిరొట్ట ఎరువుల వలన భూసారం పెరిగి పంట పొలాలకు మంచి సేంద్రీయ ఎరువు లభిస్తుందని ఏఓ శ్రావణ్‌కుమార్ తెలిపారు. బర్లిలో ప్రి మాన్సూన్ డ్రై షోయింగ్ (పీఎండీఎస్)పై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ప్రధాన పంటకు ముందు సుమారు 30 రకాలు ఎకరాకు కనీసం 12కిలోలు చొప్పున విత్తనాలు చల్లుకొని 40రోజుల తరువాత దానిని భూమిలో కలియదున్నడంపై వారికి అవగాహన కల్పించారు. వివిధ రకాల విత్తనాలు వేయడం వలన ఎకరాకు సుమారు 8మెట్రిక్ టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభిస్తుందన్నారు.

దీనివలన తేమశాతం పెరుగుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు పంట నేల వాలిపోదన్నారు. దీనిపై రైతులు అవగాహన కలిగించుకుని దీనిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్మి, తిరుపతిరావు, ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

## వేతనదారులు ఉదయానికే పనుల్లో పాల్గొనాలి



నీలకంఠాపురం బందలో మస్తరు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

**సీతానగరం:** మండలంలోని ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున వేతనదారులు ఉదయం , సాయంత్రం పూటల్లో పాల్గొని ఎండ పడకుండా వడదెబ్బకు గురికాకుండా ఇళ్లకు చేరుకోవాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. వెంకటాపురం పంచాయతీ నీలకంఠాపురం గదబవాని బందలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు జరుగుతున్న వేతనదారుల మస్తరు రికార్డులను శుక్రవారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఉదయం, సాయంత్ర పూటల్లో ఎండ పడకుండా వేతనదారులంతా పనుల్లో పాల్గొని మస్తరు వేయించుకోవాలని సూచించారు. అలాగే దాహార్తిని తీర్చడానికి నీడనిచ్చే చెట్ల కింద నీరు సమకూర్చుకోవాలని కోరారు. టీఏలు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



బస్సులో ప్రయాణికులను, లగేజీలను తనిఖీలు చేస్తున్న చెకింగ్ స్క్వాడ్ సిబ్బంది

## పోలీసుల ముమ్మర తనిఖీలు

**పార్వతీపురం రూరల్:**

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో సంఘ విద్రోహ కార్యకలాపాల, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు కట్టడికి జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు పోలీసు శాఖ నేతృత్వంలో శనివారం నిర్వహించారు. ఇటీవల జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాం ప్రాంతంలో తీవ్రవాదులు అమాయకుల మీద జరిపిన కాల్పుల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా కూడా భద్రతా బలగాలను అప్రమత్తంగా ఉంచాలని జిల్లా పోలీస్ అధికారులకు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. వారి ఉత్తర్వుల మేరకు శనివారం సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలు చోట్ల విస్తృత తనిఖీలు నిర్వహించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి ఆదేశించారు.



హోటల్లో ఉన్న వారి వివరాలను పరిశీలిస్తున్న పోలీసులు

#### విధ్వంస నిరోధక తనిఖీలు

బస్టాండ్లు, ఆటో స్టాండ్లు, మార్కెట్లు, జన సమూహాలు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో, బీడీ టీమ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలువురిని తనిఖీ చేసి సాంకేతిక పరికరాల ద్వారా అనుమానితుల వేలిముద్రలు పరిశీలించారు.

#### అనుమానితుల కోసం ఆకస్మిక తనిఖీలు

ఎవరైనా అనుమానితులు/నిందితుల జాడ తెలుసుకోవడం కోసం బస్టాండ్లు రైల్వే స్టేషన్లు ఇతర జన సమూహాలు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమానితులు, పాత నేరస్తులు, కొత్త వ్యక్తులు, ఆయా ప్రదేశాలకు పరిస్థితులకు సంబంధం లేని వ్యక్తులు ఎవరైన ఉంటే వారు అక్కడ ఎందుకు ఉన్నారు, ఎక్కడ నుంచి వచ్చారు, ఎక్కడికి వెళ్తున్నారు, ఏ పని కోసం వెళ్తున్నారు, పలు కోణాల్లో విచారిస్తూ తనిఖీలు నిర్వహించారు. అలాగే లాడ్జిలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేసి అక్కడ ఉన్న వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అనుమానితుల వేలిముద్రలు సాంకేతిక పరికరాల సహాయంతో పరిరక్షించారు.

#### విస్తృత వాహన తనిఖీలు

జిల్లాలో పలు ప్రధాన కూడళ్లు, అంతర్ జిల్లా, అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు, ఇతర జిల్లాల నుంచి జిల్లాలోకి వచ్చే వెళ్లే మార్గాలలో విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది అనుమానిత వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించి వాహన రిజిస్ట్రేషన్ నంబర్, పేరు, ఒక వాహనానికి వేరే వాహనం నంబరు తగిలించరా ఎక్కడ నుంచి వస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు, ఎందుకు వెళ్తున్నారో అంశాలకు సంబంధించి పోలీసులు ఆరా తీశారు. అనుమానిత వాహనాలను పోలీస్ శాఖ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వాటి వివరాలు పరిశీలించారు.



రైల్వేస్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో లగేజీలను పరిశీలిస్తున్న పోలీసులు

## ఒక్కపూటే ఉపాధి పనులు..

**భామిని:** ఎండలు మండుతున్న నేపథ్యంలో ఉపాధి పనులు ఒక్కపూట మాత్రమే చేపట్టాలని ఎమ్మెల్యే జయకృష్ణ అన్నారు. ఎంపీపీ తోట శాంతికుమారి అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని అభివృద్ధి పనులపై సమీక్షించారు. సమావేశానికి రెవెన్యూ అధికారులు హాజరు కాకపోడవంపై ఎమ్మెల్యే జయకృష్ణ మండిపడ్డారు. భూ సమస్యలు పేరుకుపోతున్నాయని, కార్యాలయానికి వచ్చి ప్రజలు సమస్యలు తెలియజేస్తున్నా పరిష్కారం కావడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఉపాధి వేతనదారుల కు ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ బి.సంధ్యారాణి, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జయకృష్ణ సమక్షంలో వేతనదారుల సమస్యలను వివరిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్

## సెల్ గాలానికి చిక్కొద్దు

- విద్యార్థులు, యువతపై ప్రతికూల ప్రభావం
- తల్లిదండ్రులే నియంత్రించాలి..

**పార్వతీపురం:**

నడుస్తున్నా.. కూర్చొన్నా... తింటున్నా... నిద్రపోతున్నా... ఇలా ఏ సమయంలో చూసినా యువత సెల్‌ఫోన్‌ను వీడడం లేదు. ఉదయం నుంచి రాత్రి నిద్రపోయే వరకు ఎక్కువ సమయం స్మార్ట్ ఫోన్‌తోనే గడుపుతున్నారు. సాంకేతికతతో ఎంత ప్రయోజనం ఉందో అంతే స్థాయిలో ముప్పు పొంచి వుంది. కొందరు విద్యార్థులు సెల్‌ఫోన్‌తో సమయం వృథా చేసుకొని చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. పరీక్షల సమయంలో కూడా తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు.

#### రోజంతా రీల్స్..

సామాజిక మాధ్యమాల్లో వస్తున్న రీల్స్ చూస్తూ రోజంతా కాలం గడిపేస్తున్నారు. లైక్‌ల కోసం ప్రమాదకర, అసభ్యకరంగా ఉండే వీడియోలు పెడుతున్నారు. విద్యార్థులు వీటిని చూస్తూ విలువైన కాలాన్ని గడిపేస్తున్నారు. పరీక్షల సమయంలో చదువుపై ఏకాగ్రత లేకపోవడం కారణంగా పరీక్ష ఫలితాలు వెలువడే సమయంలో తమకు తక్కువ మార్కులు వస్తున్నాయనే భయంతో కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. విద్యార్థి నుండి సెల్‌ఫోన్ తీసుకున్నారనే కారణంగా ఇటీవల ఓ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై దాడి చేసిన సంఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇంతకంటే దారుణం ఏముంటుంది.

అతి వినియోగంతో అనర్థం

స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరిగితే అనర్థాలకు దారి తీస్తుంది. అతి వినియోగం వల్ల మానసిక పరిస్థితి మారిపోతుంది. ఈ కారణంగా పెద్దల పట్ల గౌరవం లేకుండా ప్రవర్తిస్తారు. సమయానికి నిద్ర కూడా రాకపోవడంతో క్రమేణా ఆరోగ్యం క్షీణిస్తుంది. ప్రాథమిక దశలో గుర్తించి మానసిక వైద్యులను సంప్రదిస్తే సత్ఫలితాలుంటాయి.

